క్లుప్తంగా

లఘు చిత్రాల ప్రదర్శన నేడు

సీతంపేట : తెలుగు నాటక వైతాళికుడు బాదం గిర్ సాయి నిర్మించిన రెండు లఘుచిత్రాలను ఆదివారం సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రదర్శించనున్నట్టు లఘుచిత్ర దర్శకుడు సరికొండ రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. లవ్ తుఫాన్, నిహారిక చిత్రాల ప్రివ్యూ ఉంటుందని, 22 నిమిషాల నిడివి గల నిహారిక చిత్రంలో హీరో యాదకుమార్, హేమ నటించగా, 42 నిమిషాల లవ్ తుఫాన్‌లో రుక్సానా, తేజ, జి.గౌతం, జోగారావు నటించినట్టు తెలిపారు. బాదం గిర్ సాయి అభిమానులు, సన్నిహితులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రాంగ్ పార్కింగ్‌తో ఇక్కట్లు



నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డులో ఇరువైపులా పార్కింగ్ చేసిన వాహనాలు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డులోని 60 అడుగుల రోడ్డులో రాంగ్ పార్కింగ్‌తో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఈ రోడ్డులో ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసిన కార్లు, ద్విచక్ర వాహనాలతో స్థానికులు, వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. నేషనల్ హైవే నుంచి జయభేరి కింద రోడ్డులో శనివారం రాత్రి కార్లు పార్కింగ్ చేసి బయటకు వెళ్లిపోవడంతో వాహనాల రాకపోకలకు కష్టతరంగా మారింది. రోజూ ఇటు వైపు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో కార్లు రోడ్డుపై పార్కింగ్ చేయడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోందని పలువురు వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వర్షం కురిస్తే పోలీసుల కష్టాలు రెట్టింపు



వర్షాలకు తడిసిపోయిన క్రైం పోలీస్ స్టేషన్ గోడ

సీతమ్మధార : స్థానిక బాలయ్య శాస్త్రి లే అవుట్ వద్ద గల నాలుగో పట్టణ క్రైం పోలీస్ స్టేషన్‌ను వర్షం కష్టాలు వదలడం లేదు. ఇప్పటికే చాలీచలని గదులతో అవస్థలు పడుతున్న క్రైం పోలీసుల కష్టాలు వర్షం కురిస్తే రెట్టింపు అవుతున్నాయి. ఈ స్టేషన్‌లో మొత్తం 16 మంది వరకు అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. ఇక్కడి బీరువాల పైభాగంలో థర్మాకోల్ సీలింగ్ షీట్లు ఊడిపోవడంతో వర్షాలకు సామగ్రి తడిసిపోతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. వర్షపు నీరు లీకై బీరువాలోని రికార్డులు ఎక్కడ తడిసిపోతాయోనని క్రైం పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇక్కడి సిబ్బంది వర్షాలు కురిసే సమయంలో ఎక్కువగా వర్షపు నీరు రాకుండా చెక్క ముక్క సపోర్టుగా ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి క్రైం పోలీస్ స్టేషన్‌కి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించాలని స్థానిక సిబ్బంది కోరుతున్నారు.

ఏయూలో అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రయోగశాలలు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో ప్రయోగశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేలా మరింత శ్రద్ధ తీసుకుంటున్నామని వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. దేశ గుణాత్మక మండలిలో భాగమైన నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబరేటరీస్(ఎన్ఏబీఎల్) ఆధ్వర్యంలో ఏయూ ఇంజినీరింగ్ విభాగంతో సంయుక్తంగా ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్, దాని ప్రయోజనాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఏయూలోని ప్రయోగశాలలను ఎన్ఏబీఎల్ ప్రమాణాలకు అనుగుణంగా ప్రామాణికరించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఇన్‌చార్జి హెడ్ ప్రొఫెసర్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రయోగశాలలకు ఎన్ఏబీఎల్ గుర్తింపు ఎంతో అవసరమన్నారు. ఎన్ఏబీఎల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడారు.

బొమ్మ అదుర్స్



జిల్లా స్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులతో...

ప్రత్యేక శిక్షణ ఇస్తున్న డ్రాయింగ్ టీచర్ భాస్కర్

చిత్ర లేఖనంలో రాణిస్తున్న మధురానగర్ హైస్కూల్ విద్యార్థులు



మధురానగర్ హైస్కూల్‌లో చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తున్న డ్రాయింగ్ టీచర్ భాస్కర్



తాము గీసిన చిత్రాలు చూపిస్తున్న విద్యార్థులు

సీతంపేట

ప్రతిభ, సృజనాత్మకత గుర్తించడానికి విద్యార్థి దశ ఎంతో కీలకమైనది. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ గుర్తించి వారి అభిరుచికి తగినట్టు శిక్షణ, ప్రోత్సాహం అందిస్తే ఉన్నతంగా రాణిస్తారనేందుకు మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులే నిదర్శనం. ఈ పాఠశాలలో కొంత మంది విదార్థులు ఆటల్లో, మరికొంత మంది డ్రాయింగ్‌లో ప్రతిభ చూపుతున్నారు. పాఠశాలలో 6 నుంచి 10 వరకు చదువుతున్న విద్యార్థులకు డ్రాయింగ్ టీచర్ మరిచెర్ల భాస్కర్ చిత్రలేఖనంలో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. ప్రతి తరగతికి వారానికి రెండు పీరియడ్స్ డ్రాయింగ్ కోసం కేటాయించారు. పాఠశాలలో సుమారు 100 నుంచి 120 మంది శిక్షణ పొందుతుండగా, 10 నుంచి 15 మంది జిల్లా స్థాయిలో రాణిస్తున్నారు. గత నెలలో ఎస్‌టీపీసీ నిర్వహించిన పోటీల్లో ఇద్దరు విద్యార్థులు జిల్లా స్థాయిలో గెలుపొంది, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడం విశేషం. జిల్లా స్థాయిలో జరిగే ఏ డ్రాయింగ్ పోటీలోనైనా మధురానగర్ జీవీఎంసీ విద్యార్థులు తప్పకుండా పాల్గొని, బహుమతి కూడా సాధిస్తున్నారు.

పర్యావరణంపై అవగాహన కలిగించేలా..

పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కలిగించేలా కాన్సెప్ట్ బేస్డ్ డ్రాయింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా సేవ్ వాటర్, సేవ్ ఎనర్జీ, పొల్యూషన్, సేవ్ ఎలక్ట్రిసిటీ, బయో డైవర్సిటీ, సోలార్ ఎనర్జీ... ఇలా పలు అంశాలపై విద్యార్థులు సొంత ఆలోచనతో చిత్రాలు రూపొందించేలా భాస్కర్ శిక్షణ ఇస్తున్నారు. చిత్రలేఖనంలో పెన్సిల్ అవుట్‌లైన్, స్కెచ్ అవుట్‌లైన్, ఆయిల్ పేస్టల్ షేడింగ్, వాటర్ కలరింగ్, వాటర్ పెయింటింగ్, గ్లాస్ పెయింటింగ్‌పై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. పలువురు అద్భుతమైన చిత్రాలు గీసి ఆలోచింపజేస్తున్నారు.

ఏకాగ్రతతోపాటు ఆలోచనాశక్తి..

డ్రాయింగ్ నేర్చుకుంటే ఏకాగ్రత, ఓపిక, పట్టుదల, శ్రద్ధ, ధ్యాస, సృజనాత్మకత, ఆలోచనా శక్తి, జ్ఞానం పెరుగుతుందని, క్రమశిక్షణ అలవడుతుందని డ్రాయింగ్ టీచర్ భాస్కర్ చెబుతున్నారు. కాన్సెప్ట్ చెప్పి దానికి చిత్ర రూపం ఇవ్వాలంటే విద్యార్థుల మెదడు, మనసులో ఆలోచన కలుగుతుందని, కాన్సెప్ట్‌కు తగినట్టు చిత్రరూపం ముందుగా మైండ్‌లో క్రియేట్ అవుతుందని, ఆ తర్వాత చార్ట్‌పై చిత్రాన్ని గీయగలరని చెప్పారు. డ్రాయింగ్‌లో కూర్చుంటే చిత్రం పూర్తయ్యే వరకు రెండు మూడు గంటలు పట్టినా పూర్తయ్యే వరకు లేవరని, దీని వల్ల విద్యార్థి దశ నుంచే ఓపిక, పట్టుదల, ఏకాగ్రత, ఆలోచన శక్తి పెరుగుతుందంటున్నారు. డ్రాయింగ్‌లో ప్రతిభ చూపే విద్యార్థులు చదువులోనూ ముందంజలో ఉంటారని, సున్నిత మనస్తత్వంతో ఎవరినీ నొప్పించరని క్రమశిక్షణతో నడుచుకుంటారని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొన్నా



ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్నా. 6వ తరగతి నుంచి భాస్కర్ సార్ వద్ద డ్రాయింగ్ నేర్చుకుంటున్నా. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించాను. గత నెలలో రాష్ట్ర స్థాయి డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్నా. ఇప్పటి వరకు వందకు పైగా డ్రాయింగ్స్ వేసి, బహుమతులు సాధించాను. రాష్ట్ర స్థాయిలో బహుమతి సాధించాలన్నది నా లక్ష్యం.

– సీహెచ్.లావణ్య, 9వ తరగతి, మధురానగర్ హైస్కూల్

గత ఏడాది నుంచి శిక్షణ



ప్రస్తుతం 7వ తరగతి చదువుతున్నా. గత ఏడాది నుంచి స్కూల్‌లో డ్రాయింగ్ నేర్చుకుంటున్నా. కాన్సెప్ట్ చెప్పి దానిని ప్రతిబింబించేలా చార్టుపై డ్రాయింగ్ వేయడం నేర్చుకున్నా. జిల్లా స్థాయి పోటీలో గెలిచి రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొన్నా. త్వరలో రాష్ట్ర స్థాయి పోటీలో గెలుపొందేలా డ్రాయింగ్‌లో మెలకువలు నేర్చుకుంటున్నా.

– కె.నవదీప్, 7వ తరగతి, మధురానగర్ హైస్కూల్

వందకు పైగా చిత్రాలు



10వ తరగతి చదువుతున్న నేను ఆరో తరగతి నుంచి డ్రాయింగ్‌లో శిక్షణ పొందుతున్నా. వారానికి రెండు తరగతులు కేటాయించి మెలకువలు నేర్పిస్తున్నారు. సేవ్ వాటర్, స్వచ్ఛ భారత్, సేవ్ ఎనర్జీ, పొల్యూషన్, బయో డైవర్సిటీ అంశాలపై వందకుపైగా చిత్రాలు గీశాను. చాలా బహుమతులు సాధించాను. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నా.

– టి.హైమ, 10వ తరగతి, మధురానగర్ హైస్కూల్

డ్రాయింగ్ అంటే చాలా ఇష్టం



నేను 10వ తరగతి చదువుతున్నా. డ్రాయింగ్ అంటే చాలా ఇష్టం. నాలుగేళ్లుగా స్కూల్‌లో డ్రాయింగ్ నేర్చుకుంటున్నా. ఇప్పటి వరకు సేవ్ గర్ల్ చైల్డ్, స్వచ్ఛభారత్, స్వచ్ఛ సర్వేక్షణ్, విశాఖ అందాలు, సేవ్ వాటర్, సేవ్ ఎనర్జీ, బయో డైవర్సిటీ, సోలార్ ఎనర్జీ అంశాలపై 40కి పైగా చిత్రాలు గీశాను. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నా.

– టి.రామ త్రివేణి, 10వ తరగతి, మధురానగర్ హైస్కూల్

12 ఏళ్లుగా శిక్షణ ఇస్తున్నా



గత 12 ఏళ్లుగా మధురానగర్ హైస్కూల్‌లో డ్రాయింగ్ నేర్పిస్తున్నా. జిల్లా స్థాయిలో మా విద్యార్థులు చాలా బహుమతులు సాధించారు. హెచ్‌ఎం శాంతికుమారి, సహచర ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఇది సాధ్యమైంది. వారంలో రెండు పీరియడ్స్ తీసుకుని డ్రాయింగ్‌లో శిక్షణ ఇస్తున్నా. ప్రస్తుతం 40 మంది అద్భుతంగా చిత్రాలు గీస్తున్నారు.

– మరిచెర్ల భాస్కర్, డ్రాయింగ్ టీచర్, మధురానగర్ హైస్కూల్

శాంతినగర్‌లో కళాంజియా సమావేశం



కళాంజియా సభ్యులకు బహుమతులు అందజేస్తున్న గొర్లె చందు

కంచరపాలెం : జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం శాంతినగర్‌లో శనివారం 52 కళాంజియా సంఘాల సభ్యుల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నేషనల్ పోర్ట్ ట్రస్ట్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు ముఖ్య అతిథిగా పాల్గొని వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాంజియా సమాఖ్య సభ్యుల లావాదేవీలు, పొదుపు, అప్పులు, సభ్యుల ఆరోగ్యం, ఎల్ఐసీ వంటి సంక్షేమాలు, ప్రగతి సాధించాలని కోరారు. అనంతరం సభ్యులకు బియ్యం, నిత్యావసర సరకులు, నగదు అందజేశారు. కళాంజియా మహిళలకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు దూది నరసింగరావు, బీవోడీలు వెంకటలక్ష్మి, కె.పరదేశమ్మ, కనక మహాలక్ష్మి, బి.లక్ష్మి, ఎండీ పృథ్వీ, అసోసియేట్ ఎం.హరిణి, తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు నివాళి



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్యామలదీపిక

సీతమ్మధార : దేశం గొప్ప నేతను కోల్పోయిందని, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అన్ని రంగాల్లో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక అన్నారు. ఈ మేరకు శనివారం బీజేపీ కార్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా దేశం కోసం పని చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన మరణం దేశానికి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో చరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి కదంబం సమర్పణ నేడు



గోదాదేవి అమ్మవారి విగ్రహంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు శేషాచార్యులు, భక్తులు

మురళీనగర్ : కదంబం.. ఈ మాట వినగానే భక్తులకు విపరీతమైన భక్తి భావన కలుగుతుంది. ధనుర్మాసంలో వైభవ వేంకటేశ్వరుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కదంబం ప్రసాదం సమర్పించడం ఆనవాయితీ. ఈ ప్రసాదం కోసం భక్తులు ప్రతీ ఆదివారం అత్యధిక సంఖ్యలో తరలివస్తారు. 21 రకాల కూరగాయలతో తయారు చేసే ఈ ప్రసాదం రుచికరం.. శుచికరం.. ఆధ్యాత్మికం మేళవింపుగా భక్తులు భావిస్తారు. అంతే కాకుండా ఆరోగ్యపరంగా సంపూర్ణ ఆహారమని చెప్పాలి. ఇందులో వాడిన ప్రతీ పదార్థం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. బియ్యం, కందిపప్పు, నెయ్యి, ఆయిల్, ఇతర మసాల సామగ్రితోపాటు టమాటా, గుమ్మడి, బీన్స్, రథం చిక్కుడు, బర్బాటీ, బంగాళ దుంపలు, క్యాబేజీ, బీట్‌రూట్, క్యారెట్, బీన్స్, అల్లం, కొబ్బరికాయలు, పచ్చిమిర్చి, కొత్తిమీర, కాలీఫ్లవర్, కరివేపాకు, క్యాప్సికం, చిక్కుడు, తోటకూర, పాలకూర, గోరు చిక్కుడు వంటి 21 రకాల కూరగాయలతో దీన్ని అత్యంత రుచికరంగా తయారు చేసి వైభవ వేంకేశ్వరస్వామికి సమర్పిస్తారు.

రంగనాథునికి 12వ పాశురం విన్నపం

కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాలార్చన చేశారు. గోదాదేవి విగ్రహంతో మేళతాళాల మధ్య వేద మంత్రోచ్చరణలతో అర్చకుడు శేషాచార్యులు, భక్తులు ప్రదక్షిణ చేశారు. అనంతరం తిరుప్పావై సేవా కాలం, విశేష భోగం సమర్పించారు. గోదాదేవి తరఫున శ్రీరంగనాథునికి 12వ పాశురం విన్నవించారు. అనంతరం మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. ఆలయం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మురళీనగర్ రామాలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సీతారామచంద్రస్వామికి నిత్య పూజలతోపాటు పాశురం విన్నవించారు.

కులశేఖర్ మరణం తీరని లోటు



కులశేఖర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు, బీవీకే కళాశాల సిబ్బంది

సీతంపేట : వంద సినిమాలకు పైగా జనరంజకమైన పాటలు రచించిన కులశేఖర్ మరణం సినీ పరిశ్రమకు తీరని లోటని బీవీకే కళాశాల పూర్వ విద్యార్థులు సంతాపం తెలిపారు. బీవీకే కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థులు కులశేఖర్ సంస్మరణ సభ నిర్వహించారు. కులశేఖర్‌తో చదివిన సహచర విద్యార్థులు, పూర్వ విద్యార్థులు హాజరై కులశేఖర్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. చిన్నప్పటి నుంచి కులశేఖర్‌కు సాహిత్యంపై ఆసక్తి ఉండేదని, చదువుకుంటున్న రోజుల్లోనే పాటలు రాసి అనేక బహుమతులు పొందారని తెలిపారు. చదువు పూర్తయ్యాక జర్నలిస్టుగా సేవలందించారని, తర్వాత తేజ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం సినిమాతో గేయ రచయితగా పరిశ్రమకు పరిచయమయ్యారన్నారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి వద్ద శిష్యరికం చేస్తూ సినీ గీతాల రచనలో మెలకువలు నేర్చుకున్నారని తెలిపారు. ముందుగా కులశేఖర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీవీకే చైర్మన్ నాగేశ్వరరావు, కోశాధికారి శ్రీధర్, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, సత్యారావు, పిల్లా రమణమూర్తి, కృష్ణాచారి, రత్న శేఖర్ పాల్గొన్నారు.

కిటకిటలాడిన బల్లిగిరి దేవాలయం





వేంకటేశ్వరుని దర్శనం కోసం బారులు తీరిన భక్తులు, విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి

అల్లిపురం : ధనుర్మాసం రెండో శనివారం సందర్భంగా బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున 5 గంటల నుంచి స్వామికి అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, ఆరాధన, భక్తుల గోత్రనామాలతో ధనుర్మాస అర్చనలు, తిరుప్పావై సేవాకాలం, నివేదన, మంగళాశాసనం, నీరాజనం, మంత్రపుష్పం, గోదాదేవి తిరుప్పావై పాసుర విన్నపం అనంతరం భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. ముందుగా దేవాలయం కల్యాణ మండపంలో హోమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త అవసరం

- జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రమణమూర్తి

డాబాగార్డెన్స్ : నగరంలో సైబర్ నేరాలు అధికమవుతున్నాయని, వాటి నుంచి జాగ్రత్తగా ఉండాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి సూచించారు. సైబర్ నేరాలపై సైబర్ సెక్యూరిటీ నిపుణుడు ఐఎల్ నరసింహారావుతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మహిళా వెల్ఫేర్ కార్యదర్శులు, ఎన్జీవోస్, అకౌంట్ విభాగం, ఎస్ఆర్‌యూ విభాగం, సీవోసీ విభాగాల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, అందుకు సంబంధించి తమ మొబైల్ హ్యాకింగ్‌కు గురికాకుండా సరైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళల వేధింపులు, సైబర్ నేరగాళ్లపై ఏ విధంగా ఫిర్యాదు చేయాలో తెలుసుకోవాలన్నారు. అనంతరం ఐఎల్ నరసింహారావు మాట్లాడుతూ సైబర్ నేరాలు, మొబైల్ సెక్యూరిటీ అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో అవగాహన కల్పించారు. సైబర్ నేరాల రకాలు, మొబైల్ హ్యాకింగ్ జరగకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఏ విధమైన సంఘటనలు జరిగినప్పుడు ఎక్కడ? ఎలా? ఫిర్యాదు చేయాలో వివరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు శివప్రసాద రాజు, పర్యవేక్షక ఇంజినీరు గోవిందరావు, జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు.

అప్రమత్తతతో మోసాలకు అడ్డుకట్ట



రైతుబజార్‌లో వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న మర్రి సత్యనారాయణ

సీతంపేట : జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నరసింహనగర్ రైతుబజార్‌లో జిల్లా వినియోగదారుల సంఘాల సమైఖ్య చైర్మన్ మర్రి సత్యనారాయణ వినియోదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంప్రదించాల్సిన టోల్ ఫ్రీ నంబర్లపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యలపై 1967 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోకుండా 1930, పోలీస్ సహాయం కోసం 100, మహిళా వేధింపులకు 112, 181, ఉచిత న్యాయం కోసం 15100, 0891 – 2575046 నంబర్లకు ఫిర్యాదు చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. ఇందుకు సంబంధించిన బోర్డులను బజారు ఎస్టేట్ ఆఫీసర్ పి.కొండబాబు ఆధ్వర్యంలో పలుచోట్ల ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బజారు సహాయకుడు ఆర్.సత్యనారాయణ, వినియోగదారులు, రైతులు పాల్గొన్నారు.

రైతుబజారులో పేరుకుపోయిన చెత్త



పారిశుధ్య సిబ్బంది తరలించకపోవడంతో రైతుబజార్‌లో పేరుకుపోయిన చెత్త

సీతమ్మధార : స్థానిక రైతుబజార్‌లో చెత్త పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రైతుబజార్‌లో రెండు పూటలా వందలాది సంఖ్యలో రైతులు కూరగాయలు విక్రయిస్తారు. నిత్యం అధిక పరిమాణంలో వ్యర్థాలను సిబ్బంది తరలిస్తుంటారు. అయినప్పటికీ ఇక్కడి గుడ్ల కౌంటర్ పక్కనే చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. రోజులు గడుస్తున్నా జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు తరలించడం లేదని రైతులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు చెత్త, మరోవైపు కుళ్లిపోయిన కూరగాయలు కలిసిపోయి జుగుప్సాకరంగా మారిందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన రావడంతో ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ చెత్త బండి కూడా చెత్తలోనే కూరుకుపోయినా ఎవరూ పట్టించుకోకపోవడం తీవ్ర దుమారం రేపుతోంది. మరోవైపు ఈ చెత్త చెంతనే అరిటి గెలలు కూడా నిల్వ చేయడం గమనార్హం. ఇప్పటికైనా జీవీఎంసీ 23వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్పందించి ఇక్కడి చెత్త తరలించి, పారిశుధ్యం మెరుగుపరచాలని రైతులు, సిబ్బంది కోరుతున్నారు.

ఉపాధి కోర్సులతో కుటుంబానికి ఆసరా

డాబాగార్డెన్స్ : ఉపాధి కోర్సులతో కుటుంబానికి ఆసరా అని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ జి.దేముడు బాబు సూచించారు. ఫిషింగ్ హార్బర్ బీచ్‌రోడ్డులో గల బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జన శిక్షణ సంస్థ సహకారంతో నిర్వహించిన టైలరింగ్ శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సీఐ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు తీరిక సమయాల్లో స్వయం ఉపాధి కోర్సులపై దృష్టి సారించి, ఆర్థికంగా నిలబడాలని సూచించారు. శిక్షణ అందిస్తున్న బాల వికాస్ ఫౌండేషన్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు, స్థానిక నాయకుడు గోడే నరసింహాచారి, కస్తూరి వెంకటరావు, బ్రహ్మకుమారి రామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు నవరంగపూర్ నివాసి



కలాస్ గౌడ్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న బెనర్జీ

సీతమ్మధార: ఒడిశాలోని నవరంగపూర్‌కు చెందిన కలాస్ గౌడ్ అనే వృద్ధుడు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నాడు. ఊరు వదిలి కొన్నాళ్లు ముంబైలోని ఒక బీర్ షాపులో, తరువాత పూణెలో గ్యాస్ డీలర్ దగ్గర పని చేసి చివరకు విశాఖపట్నం చేరుకున్నాడు. ఏయూటీడీ సిబ్బంది ఇతడిని రెస్క్యూ చేసి నాలుగు నెలల పాటు షెల్టర్‌లో ఉంచి, మందులిచ్చి మాములు మనిషినిగా మార్చారు. వైజాగ్ నుంచి నేరుగా నవరంగ్‌పూర్‌కు తీసుకెళ్లి అన్న కొడుకు రాజేంద్ర మోహన్కుడాకు కలాస్ గౌడ్‌ను క్షేమంగా అప్పగించారు. రీయూనియన్ చేసిన శ్రద్ధా సోషల్ వర్కర్ సువాదీప్ బెనర్జీకి, ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసుకు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.